# నాన్న మనసు

– వల్లమూడి దుర్గాంబ

"సాయంత్రం విరజక్క వాళ్ళింటి కెళ్దాం అక్కా! వాళ్ళని కూడా ఇక్కడికే రమ్మని చెబుతాను. అందరం కలిసే వెళ్దాం పెళ్ళికి" గిరిజక్క చేతిలోంచి కాఫీ కప్పు అందుకుంటూ చెప్పాను.

"నువ్వెళ్ళరా! నేను రాను." వంటింట్లోకి వెళ్తూ అంది గిరిజక్క.

"అ దేం? నీ కేమన్నా ప నుందా?" నేనూ లేచి వెళ్ళి వంటింటి కివతలగా ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ అడిగాను.

రెండు నిముషాల మౌనం తరువాత మళ్ళీ అడిగాను అదే ప్రశ్న. "దానితో నేను మాట్లాడ్డం లేదు."

ఒక్కసారిగా తెల్లబోయి తలెత్తి చూశాను. త నన్న మాటని జీర్ణం చేసుకోలేకపోతున్నాను.

"మాట్లాడకపోవట మేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ ర్నెల్లయింది మా మధ్య మాట ల్లేక! నా దేం తప్పు లేదు. పెద్దవాళ్ళం మే మేదో అనుకుంటాం. స్కూల్లో నా పిల్లలతో కూడా మాటా డొద్దని దాని పిల్లలకి చెప్పిం దట! నాకేనా పౌరుషం లేంది?" అసలు విషయం చెప్పకుండా ఏదేదో చెప్పేస్తూ మనసులో కోపాన్నంతా వెళ్ళగక్కుతోంది.

నాకు కొంతవరకు అర్థమైంది. అయినా నమ్మబుద్ధి కావడం లేదు.

గిరిజక్క, విరజక్క మాట్లాడుకోకపోవడ మేమిటి. వా ళ్ళిద్దరూ ఒకే కడుపున పుట్టడమే కాదు, ఒకేసారి పుట్టారు కవల పిల్లలుగా. అక్క లిద్దరి తర్వాత నేను. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ వా ళ్ళిద్దరూ ఇద్దరు కాదేమో, ఒక్కరే నేమో అనిపించేది. రూపంలోనే కాదు అభిరుచులు, అలవాట్లు, అభిప్రాయాలు అన్నీ ఒకటే! అక్కా చెల్లెళ్ళంటే శ్రీహరిగారి కూతుళ్ళలా ఉండాలి అంటూ మాకు తెలిసినవాళ్ళు నాన్నగారిని పొగడడం నేను ఎన్నోసార్లు విన్నాను. నాన్నగారి కళ్ళలో ఆ గర్వం తాలూకు మెరుపు ఇప్పటికీ అలానే ఉంది.

కూతుళ్ళని వేరు వేరు ఊళ్ళకి ఇస్తే వేరైపోత రనే భయంతో ఇద్దరికీ ఒకే ఊళ్ళో సంబంధాలు దొరికే వరకూ ఆగి, ఒకేసారి పెళ్ళిళ్ళు చేశారు నాన్న.

"నీ కూతుళ్ళు బతికించారు శ్రీహరీ! ఒకే మొగుడిని అడగలేదు." గిరిజక్కనీ, విరజక్కనీ చిన్నప్పటి నుంచి ఎరుగున్న పక్కింటి అంకుల్ పెళ్ళిలో నాన్నతో నవ్వుతూ అన్న మాటలు గుర్తొచ్చినప్పు డల్లా నాలో నేనే నవ్వుకునే వాడిని. ఇప్పుడు అక్క లిద్దరి గురించిన ఈ విషయం నాన్నకి తెలిస్తే? ఆ తరువాత ఆలోచించకలేకపోయాను.

"అస లేమైంది?" గిరిజక్క మొహంలోకి చూస్తూ నిదానంగా అడిగాను.

"నాకు తెలిస్తేగా నీకు చెప్పేందుకు? వెళ్ళి దాన్నే అడుగు. నాకు గర్వ మెక్కిందట. దాన్ని చిన్న చూపు చూస్తున్నా నట. పైగా ఆ అనే దేదో నా దగ్గరే అనొచ్చుగా, వాళ్ళ దగ్గరా, వీళ్ళ దగ్గరా అంటుంది. నా కెంత చిన్నతనం నలుగురిలో! అయినా దానికి నా మీద ఈర్ష్యరా! ఏదో దేవుడి దయ వల్ల మే మీ మధ్య బాగా సంపాదించుకుంటున్నా మని దానికి కడుపు మంట ..."

"ఆపవే!" అరిచాను అసహనంతో. "ఏం మాట లివి? విరజక్కనేనా ను వ్వనేది? చిన్నప్పుడు ఎలా ఉండేవాళ్ళు ఎలా తయారయ్యా రిప్పుడు? నాన్నకు తెలిస్తే ఇంకేమన్నా ఉందా?"

నే నా మాట అంటూండగానే "ఒరేయ్ రాజు, నాన్నకి తెలియనీకురా! ఈ విషయం నాన్నకు తెలిస్తే నే నాయన మొహంలోకి చూడలేను.." బతిమాలుతున్నట్టుగా అంది.

"నాన్నంటే అంత భక్తీ గౌరవం ఉన్నదానివైతే విరజక్క అలా మాట్లాడిం దని ఎవరో చెబితే నమ్మి తనతో మాట్లాడటం మానేసేదానివి కాదు." కోపం, నిష్ఠూరం కలిపి అన్నాను.

ఇందాకటి ఆవేశం తగ్గింది గిరిజక్కలో. "నీకు తెలీదురా! చెప్పినా నమ్మవు. మొన్న ఉగాదికి వాళ్ళకి జీతాలు రాలే దని, దాని పిల్లలకి కూడా నా పిల్లలతోబాటు బట్టలు తీస్తే ఏం చేసిందో తెలుసా? పిల్లలతో తిప్పి పంపించేస్తూ 'మాకు మీ ముష్టేం అక్కర్లేదు' అందట! ఇప్పుడు చెప్పు తప్పు నాదో, దాందో?" అంది.

ఏం చెప్పను? మాట్లాడటానికే నాకు నోరు పెగలడం లేదు.

అక్క లిద్దర్నీ చూసి, మేం కొత్తగా కట్టుకున్న ఇల్లు గృహ ప్రవేశానికి ఆహ్వానించి వెళ్దా మని వచ్చాను. ఈ ఊళ్ళో దూరపు బంధువుల పెళ్ళి ఉంది. నాన్నగారే రావలసింది. కానీ "ఎండలకి నే నేం వెళ్తానులేరా! ను వెళ్ళి అలాగే గృహ ప్రవేశానికి వారం ముందుగానే రమ్మని అక్క లిద్దరికీ చెప్పిరా!" అంటూ నన్ను పంపించారు.

వచ్చేటప్పు డున్న హుషారు, ఆనందం ఊదేసినట్టు మాయ మయ్యాయి నాలో.

సాయంత్రం ఇంటికి వచ్చిన బావగారు నాతో సరదాగా బాగానే మాట్లాడారు. కానీ పొరబాటున కూడా విరజక్కా వాళ్ళ ఊసు రాలేదు ఆయన మాటల్లో. ఇదంత గిరిజక్క కట్టుదిట్టమే నని తెలును నాకు. "పిల్లల్ని తీసుకెల్తా నక్కా!" అన్నాను విరజక్క వాళ్ళింటికి బయలుదేరుతూ. బావేం మాట్లాడలేదు. అక్క మొహంలోకి చూస్తున్నారు.

ఆరడుగుల మనిషి, సంఘంలో పేరు ప్రఖ్యాత లున్నవాడు భార్య అనుమతి లేకుండా ఒక్క మాట మాట్లాడలేడు. నాలో నేనే నవ్వుకున్నాను.

"ఎందుకులేరా! వాళ్ళకి ట్యూషన్ ఉంది. నువ్వు భోజనానికి ఇక్కడికే వచ్చేయి" అంది అక్క.

"రే పొద్దున్నే వచ్చేస్తా! పెళ్ళికి ఇక్కడ్నుంచే వెళ్దాం" అంటూ ఒక్కడినే బయలుదేరాను.

చేతిలో సూట్‌కేసు లేకుండా వస్తున్న నన్ను చూసిన విరజక్క మొహం ఒక్క క్షణం ఆనందంతో వెలిగి ఆ వెంటనే ఆరిపోయినట్టు చిన్నబోయింది.

"ఎప్పు డొచ్చావురా?" అంది సాగదీస్తూ. ఆ మాటలో మే మిప్పటికి కనపడ్డామా అనే భావం.

"పొద్దున్నే వచ్చాలే! పడుకుంటే నిద్రపట్టేసింది." పిల్లల్ని దగ్గరికి తీసుకుంటూ అన్నాను.

"అవునులే! నీ క్కూడా మేం తక్కువగా కనిపించినట్టున్నాం."

నాలో ఒక్కసారిగా చెప్పలేనంత నీరసం ఆవహించింది. దాంతోపాటు ఏం చేయలేని కోపం. "ఏమైంది మీ ఇద్దరికీ ఇలా తయ్యా రయ్యారు! మొన్న పండక్కి అక్క పిల్లలకి బట్టలు పంపిస్తే తిప్పికొట్టావట కూడా! ఎందు కిలా తయారయ్యావ్?" గట్టిగా అరిచినట్టుగా అడిగాను.

ఒక్కసారిగా గఁయ్ మని లేచింది నా మీద. "నీ కింతవరకే చెప్పిందా? నా పిల్లలకి ఎలాంటి బట్టలు పంపిందో తెలుసా? దానింట్లో పనిమనిషి పిల్లలు కూడా తొడుక్కోరు అలాంటివి. ఎంత లేని వాళ్ళమైనా మాకూ ఆత్మాభిమానం ఉంది." చెబుతూనే ఉంది విరజక్క. అన్నీ గిరిజక్క చేసిన ఫిర్యాదులే! నాకు పూర్తిగా అర్థమైంది పరిస్థితి.

గిరిజక్కా వాళ్ళది వ్యాపారం! అది బాగా సాగుతుండటం వలన వాళ్ళ పని బాగుం దిప్పుడు. సొంత ఇల్లు, ఫర్నిచర్ అన్నీ అమర్చుకున్నారు. ఈ బావగారిది ఉద్యోగం. ఉద్యోగ మంటే ఎదుగూ బొదుగూ లేని ఆదాయం పెరిగే ఖర్చులు. ఈ పరిస్థితులు గిరిజక్కలో కొంచెం గర్వాన్నీ, విరజక్కలో కొంచెం ఈర్ష్యనీ కలిగించడం సహజమే! ఆ కొంచాన్ని ఎక్కువ చేయడానికి మధ్యవర్తులుగా ఊళ్ళోవాళ్ళు ఉండనే ఉన్నారు. ఈ సమస్యను నాన్నగారు మాత్రమే పరిష్కరించగలరు. అందుకే ఇక ఆ విషయం వదిలేసి గృహ ప్రవేశం సంగతి చెప్పి ఓ వారం ముందుగా రమ్మని చెప్పాను.

"అవునురా! నాన్న గృహ ప్రవేశానికి నా కూతురికీ, దాని కూతురికీ బంగారు గొలుసులు చేయిస్తా నన్నారు చేయించారా?" రాత్రి భోజనాల దగ్గర ఆరా తీస్తూ అడిగింది విరజక్క.

నాన్న రిటైరయ్యాక వచ్చే పెన్షన్ డబ్బులో ఇల్లు కట్టుకుంటున్నాం మేము. ఇల్లు కట్టాకే నా పెళ్ళి చేయా లనేది నాన్న ఆశయం. ఆ ఇల్లు నాకే వస్తుంది కనుక పెన్షన్ డబ్బులోంచి అక్క లిద్దరి పిల్లలకీ బంగారు గొలుసులు చేయిస్తా నన్నారు నాన్న. ఆ విషయం నాకు గుర్తే లేదు. అదే చెప్పాను "ఏమో" అంటూ.

ఓ రెండు నిముషాల మౌనం తర్వాత "ఇక్కడి విషయా లేవీ నాన్నకు చెప్పకు" చిన్నగా అంది విరజక్క. త లూపి ఊరుకున్నాను.

పొద్దున్నే గిరిజక్కా వా ళ్ళింటికి వెళ్ళి అటునుంచి వాళ్ళతో కలిసి పెళ్ళికి వెళ్ళాను. పెళ్ళిలో వీ ళ్ళిద్దరూ ఒకరిని చూసి ఒకరు మొహం చిట్లించుకోవడం, చుట్టుపక్కల ఉన్న తెలిసిన వాళ్ళు గుసగుసలు చెప్పుకోవడం గమనిస్తూనే ఉన్నాను నేను.

ఆ వాతవరణంలో ఎక్కువసేపు ఉండలేక ఇంటికి రాగానే బట్టలు సర్దుకుని రెడీ అయిపోయాను ప్రయాణానికి. నేను వచ్చే ముందు, ముందు కాస్త తటపటాయించి ఆ తరువాత అడిగేసింది గిరిజక్క కూడా బంగారు గొలుసుల విషయం. ఆమె క్కూడా విరజక్కకి చెప్పిన సమాధానమే చెప్పాను.

ఇంటికి రాగానే నాన్నతో చెప్పే ధైర్యం లేక అమ్మకు చెప్పాను విషయం మొత్తం. ఇక నాన్నకు చెప్పాలా, వద్దా అనే విషయం ఆమెకి వదిలేసి నేను ఊపిరి పీల్చుకున్నాను. గృహ ప్రవేశానికి వారం ముందే ఒక రోజు అటూ ఇటూగా దిగారు అక్క లిద్దరూ. ప్రశాంతంగా ఉన్న నాన్నగారిని చూసి నే నా విషయ మేమీ చెప్పనందు కేమో కృతజ్ఞత పూర్వకంగా చూశారు నా కళ్ళలోకి. ఈ విషయా లేవీ నాన్నతో చెప్పనందుకు నేనూ అదే భావంతో అమ్మ మొహంలోకి చూశాను. ఆమె కూడా అన లా విషయాలన్నీ మరిచిపోయినట్టే కనబడుతోంది.

అక్క లిద్దరూ మాట్లాడుకోకపోయినా నాన్న దగ్గర బయటపడకుండా జాగ్రత్తగా మసలుకుంటున్నారు. పిల్ల లందరికీ ఎంత ఇదిగా తర్ఫీదు ఇచ్చారో అందరూ కలిసి మెలిసి మామూలుగానే ఆడుకుంటున్నారు. బావ లిద్దరూ కూడా ఇదివరకటంత ఆప్యాయంగా కాకపోయినా మొక్కుబడిగా నాన్న ముందు మామూలుగానే మాట్లాడుకుంటున్నారు.

నా కేంటో ఈ వాతవరణంలో ఉక్కిరి బిక్కిరి అయిపోయినట్టుగా ఉంది. తుపాను ముందు ప్రశాంతతలా కనబడుతోంది పరిస్థితి.

నాన్నగారి కీ విషయం తెలిస్తే ...? తన ఆశయాల్నీ, అభిరుచుల్నీ, అభిప్రాయాల్నీ ప్రాణాధికంగా ప్రేమిస్తా రాయన. తన పిల్లలు కూడా ప్రేమిస్తా రని ఆయన కో పెద్ద నమ్మకం. ఒక విధంగా చెప్పాలంటే గర్వం కూడా. అక్కా చెల్లెల్లు మాట్లాడుకోకపోవడం లోకానికి పెద్ద విం తేం కాదు. కాని ఆయన దృష్టిలో మాత్రం అది చిన్న విషయం కాదు. తన కూతుళ్ళ మీద ఆయన పెంచుకున్న విశ్వాసం, నమ్మకం వమ్ము అయినట్టే. తన కుటుంబం గురించి ఒకళ్ళు వల్లెత్తు మాటన్నా సహించలే రాయన. ఇప్పు డా అవకాశం అక్క లిద్దరూ బయటివాళ్ళకి కల్పించినట్టే. నాన్న గురించి వాళ్ళకి తెలియక కాదు. అందుకనే నాన్న కీ గొడవలన్నీ తెలియనివ్వకని నన్ను బతిమాలుకున్నా రిద్దరూ.

గృహప్రవేశం రోజు దగ్గరయ్యే కొద్దీ బంధువులు రావడం మొదలుపెట్టారు. అక్క లిద్దరి ప్రవర్తననీ చాలామంది కనిపెట్టలేకపోయారు. కనిపెట్టిన వాళ్ళు కూడా నాన్న మొహం చూసి మౌనంగా ఉండిపోయారు.

గృహప్రవేశం రే పనగా గిరిజక్క అమ్మను గొలుసుల గురించి అడగడం విన్నాను.

అమ్మ కూడా నాలాగే "ఏమోనే! నాకు గుర్తే లేదు" అంటోంది. అక్క మొహం చిన్నబోవటం గమనించాను.

అదే సాయంత్రం విరజక్క కూడా అమ్మ ఒంటరిగా ఉన్నప్పుడు అడిగింది అదే విషయం. అమ్మ సమాధానం కూడా అదే. ఆమె మొహంలోనూ అదే నిరాశ.

బహుశా రేపే ఇవ్వొచ్చు నాన్న ఆ చెయిన్స్ ఒకవేళ చేయించి ఉంటే అనుకున్నాను.

ఆ తరువాత రోజు గృహప్రవేశం జరిగింది. పూజ, వచ్చిన వారికి భోజనాలు - చాలా హడావుడి అయింది. ఆ రోజు కూడా గొలుసుల సంగతి ఏం చెప్పలేదు నాన్న. ఆ తరువాత రోజు వచ్చిన బంధువు లంత వెళ్ళిపోయారు. అక్క లిద్దరి కుటుంబాలు మాత్రం మిగిలాయి. ఇం కో రెండురోజులు ఉంటారిద్దరూ. ఆ సాయంత్రం వరకూ ముభావంగా ఉన్నారు. నాన్న గొలుసులు చేయించలే దనే కోపమని అర్థ మవుతూనే ఉంది.

ఆ రోజు రాత్రి భోజనా లయ్యాక డాబా మీదకి వెళ్ళిన నేను ఆశ్చర్యంతో తలమునక లయ్యాను. అక్క లిద్దరూ చాప మీద కూర్చుని ఏదో చర్చించుకుంటున్నారు.

"నువ్వే అడుగు" అంటోంది గిరిజక్క. "నువ్వే అడగరాదే?" బతిమాలుతున్నట్టుగా అంటోంది విరజక్క. "సరే! అయితే ఇద్దరం కలిసే అడుగుదాం" గిరిజక్క అంది.

ఏదో చెప్పబోయిన విరజక్క నన్ను చూసి మౌనంగా ఉండిపోయింది.

నేను నవ్వుకుంటూ మెట్లు దిగి కింది కొచ్చేశాను. వాళ్ళు వాదించుకుంటున్న విషయ మేదో అర్థమవుతూనే ఉంది.

ఆ తరువాత రోజు ఉదయం పది-పదకొండు మధ్య బావ లిద్దరూ బయట పేపరు చూస్తున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. నాన్నగారు కుర్చీలో కూర్చుని ఇంటికి అయిన ఖర్చులు లెక్కలు రాస్తున్నారు. అక్కా వా ళ్ళిద్దరూ అంతక్రితం అరగంట నుంచి పక్క రూంలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నాన్న ఏదో రాసుకుంటున్నా రని ఆగినట్టున్నారు. ఆయన పేపర్లు తీసి పక్కన పెట్టగానే ఇద్దరూ ఒకరి వెనుక మరొకరు బయటికొచ్చారు.


గిరిజక్కే మొదలుపెట్టింది - "నాన్నా! మా పాప లిద్దరికీ గొలుసులు చేయిస్తా నన్నారు ..." నసుగుతున్నట్టుగా అని కళ్ళతో విరజక్కకి సైగ చేసింది 'అడుగు' అన్నట్టుగా.

"అవు న్నాన్నా! పిల్ల లిద్దరికీ ముందే చెప్పి ఉండటం వల్ల ఇప్పుడు గొలుసులు కావాలని మారాం చేస్తున్నారు" పిల్లల మీదకి నెడుతూ అంది విరజక్క.

నాన్న ఇద్దరి మొహాల్లోకి చూసి నవ్వుతూ "కూర్చోండర్రా!" అంటూ ఇంటికైన ఖర్చు లెక్కలు చెప్పడం మొదలుపెట్టారు.

బావ లిద్దరూ కూడా వచ్చి అక్కడే కూర్చున్నారు.

"ఒక లక్షా ఇరవై వే లైందమ్మా ఇప్పటికి ఇంటికి. నాకు వచ్చిన డబ్బు చాలక ఓ ఇరవై వేలు అప్పు తేలాను. ఆ అప్పంతా రాజానే తీర్చుకుంటా డనుకోండి. ముందు మీ ఇద్దరి



పావలకి చెరో అయిదువేలు పెట్టి రెండు గొలుసులు చేయిద్దా మనుకున్నాను. కాని అప్పు ఉంది కదా వచ్చే సంవత్సరం నా కింకా కొంత డబ్బు రావలసి ఉంది. దాంతో చేయిద్దా మనుకున్నాను మొన్నటివరకూ. కానీ నిన్ననే ఆ నిర్ణయం మార్చుకుని మరో పదివేలు అప్పు చేసి ఆ గొలుసులకు ఆర్డర్ ఇచ్చి వచ్చాను." నాన్న ఊపిరి పీల్చుకోవడానికి ఆగారు.

ఆయన చెప్పే దంతా నిజమే! ఇరవై వేలు అప్పు అయింది ఇంటికి. అయితే నేను ఉద్యోగస్తుడిని కాబట్టి పరవాలేదు. కానీ గొలుసులకి నాన్న ఆర్డర్ ఇచ్చిన విషయం ఇప్పటి



వరకూ తెలియదు నాకు.

"అరె! అలా ఎందుకు చేశారు నాన్నా! పోనీ తరువాతే ఇచ్చేవారుగా?" నొచ్చుకుంటూ అంది గిరిజక్క.

"అవు న్నాన్నా! మిమ్మల్ని అప్పు చేసి మా కివ్వమన్నామా? మే మంత క్రూరంగా కనబడుతున్నామా?" కొంచెం నిష్ఠూరంగా కూడా అంది విరజక్క. బావ లిద్దరూ కూడా అదే మాటన్నారు.

నాన్న చిన్నగా నవ్వారు. "ముందు అలాగే అనుకున్నా నమ్మా! కానీ మాకు మీ నాన్న మంచీ, చెడూ కంటే బంగారమే ఎక్కువైందని తెలుసుకున్నాక ఈ పని చేయక తప్పింది కాదు."

"నాన్నా! ఇద్దరూ ఒకేసారి చిన్నగా అరిచినంత పని చేశారు.

నేను ఆశ్చర్యంతో చూస్తున్నాను. ఈ గొడవకి అమ్మ కూడా వంటింట్లోంచి బయటి కొచ్చింది.

"అవు నమ్మా! మీ ఇద్దరి మధ్యా మాట ల్లేవని, బద్ధ విరోధుల్లా ఆ ఊళ్ళో ఒకళ్ళ మీద మరొకళ్ళు బయటివాళ్ళ ముందే తిట్టుకుంటున్నారని రాజా మీ అమ్మకు చెబితే, ఆమె నాకు చెప్పి, ఏడ్చి, తన గుండె బరువు దించుకుంది. మీరు ఇక్కడి కొచ్చిన వారమైనా, నా కోసమైనా మాట్లాడుకుని కలిసి మెలిసి ఉంటారని ఎంత ఆశపడ్డానో తెలుసా! మీ అమ్మతో కూడా చెప్పాను అదే మాట. అయినా మీకు మీ నాన్న మనశ్శాంతి కంటే మీ పంతాలు, పట్టింపులే ఎక్కు వయ్యాయి.

"ఇప్పుడు నేను గొలుసు లివ్వలేదని వాటి గురించి న న్నడగడానికి నిన్న ఇద్దరూ ఒకటయ్యారు. అంటే బంగారం కోసమేగా మీ ఇద్దరూ కలిసింది? నా కంటే మీ కా బంగారమే ఎక్కువైనప్పుడు అప్పు చేసైనా దాన్ని మీ కివ్వా లనిపించింది. ఎందుకంటే మీ ఇద్దరూ కలిసిమెలసి ఉండటమే నాకు కావలసింది కాబట్టి." నాన్న గొంతు గాద్గదిక మైంది. ఆయన కళ్ళలో నీ ళ్ళూరుతున్నాయి.

"నాన్నా! మమ్మల్ని క్షమించండి నాన్నా!" అక్క లిద్దరూ ఒకేసారి నాన్న కూర్చున్న కుర్చీ దగ్గర కింద కూర్చుని ఆయన ఒళ్ళో తలలు పెట్టుకున్నారు. వణుకుతున్న వాళ్ళ గొంతుల్లో స్పష్టంగా వినబడుతోంది పశ్చాత్తాపం.

నా ఆశ వమ్ము కాలేదు. నాన్న మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగల రనుకున్నాను. అదే నిజమైంది. తడితో మెరుస్తున్న కళ్ళతో ఆనందంగా నాన్ననే చూస్తూండిపోయాను. ★